క్లుప్తంగా

వేడుకగా శ్రీసుబ్రమణ్యస్వామి హోమం



ఆలయంలో హోమం నిర్వహిస్తున్న అర్చకులు

తిరుపతి కల్చరల్: శ్రీకపిలేశ్వరస్వామి వారి ఆలయంలో జరుగుతున్న హోమ మహోత్సవాల్లో భాగంగా రెండవరోజైన మంగళవారం శ్రీసుబ్రమణ్యస్వామి వారి హోమాన్ని వేడుకగా నిర్వహించారు. ఇందులో భాగంగా యాగశాలలో ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పుణ్యాహవచనం, కలశ స్థాపనపూజ, శ్రీసుబ్రమణ్యస్వామి హోమం, పూర్ణాహుతి, నివేదన, హారతి చేపట్టారు. బుధవారం శ్రీదుర్గ, శ్రీలక్ష్మీ, సరస్వతి అమ్మవార్ల హోమం నిర్వహించనున్నారు. కార్యక్రమంలో ఆలయ డెప్యూటీ ఈఓ దేవేంద్రబాబు, ఏఈఓ పార్థసారథి, ఆలయ అర్చకులు, అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

వంశీరాజాకు అభినందనలు



వంశీరాజాను సన్మానిస్తున్న మ్యాథమెటిక్స్ ఉపాధ్యాయులు

తిరుపతి రూరల్: తిరుపతి జిల్లా కామన్ ఎగ్జామినేషన్ బోర్డు సెక్రటరీగా నియమితులైన వంశీరాజాను మంగళవారం ఆంధ్రప్రదేశ్ మ్యాథమెటిక్స్ ఫోరం రాష్ట్ర కోశాధికారి భాస్కర్ రెడ్డి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ కన్వీనర్ మురళి, గణిత ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న లీగల్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి, న్యాయవాదులు

తిరుపతి లీగల్ : లాయర్స్ వాయిస్ మాసపత్రిక-2023 నూతన క్యాలెండర్‌ను వైఎస్సార్‌సీపీ లీగల్‌సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.మనోహర్‌రెడ్డి మంగళవారం విడుదల చేసినట్టు ఆ పత్రిక ఎడిటర్ ఎస్.రాజారెడ్డి తెలిపారు. విజయవాడలోని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర లీగల్ సెల్ కార్యాలయంలో లీగల్ సెల్‌రాష్ట్ర అధ్యక్షుడు విడుదల చేసినట్టు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎడిటర్, న్యాయవాది రాజారెడ్డి గత 8 ఏళ్లుగా తిరుపతి కేంద్రంగా లాయర్స్ వాయిస్ మాసపత్రికను స్థాపించి రాజకీయ, న్యాయ, విద్యాపరమైన అంశాలతో కూడిన పత్రిక నిరంతరాయంగా నడపడం హర్షించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో విజయవాడ న్యాయవాదుల సంఘ నాయకుడు నరహరిశెట్టి శ్రీహరి, రాజేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రెండు ఇళ్లలో చోరీ



తిరుచానూరు: తిరుచానూరు పోలీస్ స్టేషన్ పరిధి, వసుంధర నగర్‌లో మంగళవారం రాత్రి తలుపులు వేసి ఉన్న రెండు ఇళ్లలో చోరీజరిగింది. విషయం తెలుసుకున్న పోలీసులు ఫింగర్ ప్రింట్, క్లూస్ టీంతో సంఘటనా స్థలానికి చేరుకొని దర్యాప్తు చేపట్టారు. ఇందులో చోరీ జరిగిన ఓ ఇంటి యజమాని వెంకటేష్ కాగా.. మరో ఇంటి యజమాని తెలియరాలేదు. వీరిరువూ స్థానికంగా లేకపోవడం, ఇళ్లకు తాళాలు వేసి ఉండడంతో చోరీ చోటుచేసుకున్నట్టు పోలీసులు నిర్ధారించారు. వారి వస్తేగానీ ఎంతమేర నగదు పోయిందో తెలుస్తుందని చెప్పారు. కేసు నమోదు కాలేదు.

ఘనంగా పశువుల పండుగ

పాకాల : మండలంలోని మద్దినాయనపల్లి గ్రామంలో పశువుల పండుగను ఘనంగా నిర్వహించారు. మంగళవారం స్థానికులు ఎద్దుల కొమ్ములకు రంగులు వేసి అలంకరించారు. గ్రామదేవతకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం వాటిని గ్రామ వీధుల్లో ఊరేగించారు. ఎద్దుల కొమ్ములకు పలకలు కట్టి వాటిని పట్టుకున్న వారికి బహుమతులను ప్రకటించారు. యువకులు రెట్టించిన ఉత్సాహంతో వాటిని పట్టుకోవడానికి ప్రయత్నించారు.

నిత్యాన్నదానానికి విరాళం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కావలికి చెందిన రసపుత్ర సుభాన్‌సింగ్, కుటుంబ సభ్యులు మంగళవారం రూ.55,555 విరాళంగా పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులుకు అందజేశారు. స్వామి, అమ్మవార్ల దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో ఆలయ పండితులు ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యం

– మేయర్ శిరీష



42వ డివిజన్‌లో పర్యటిస్తున్న మేయర్, కమిషనర్

తిరుపతి తుడా: పట్టణ ప్రజలు స్థానికంగా ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం, ఎప్పటికప్పుడు మౌలిక వసతులను కల్పించడమే తమ ప్రధాన లక్ష్యమని నగర మేయర్ డాక్టర్ శిరీష అన్నారు. కార్పొరేటర్ శేఖర్‌రెడ్డి విజ్ఞప్తి మేరకు ఆమె కార్పొరేషన్ కమిషనర్ అనుపమ అంజలి, ఇంజినీరింగ్ అధికారులతో కలిసి మంగళవారం 42వ డివిజన్‌లో విస్తృతంగా పర్యటించారు. కార్పొరేటర్ స్థానికంగా ఎదురవుతున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వీటిని వారు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం మేయర్ శిరీష మాట్లాడుతూ 42వ డివిజన్‌లో యూడీఎస్ మ్యాన్ హోల్ ఓవర్ ఫ్లో, మురుగు కాలువలు, అక్కడక్కడ చిన్నపాటి రోడ్డు మరమ్మతులు వంటి సమస్యలు గుర్తించామన్నారు. వీటికి సంబంధించి యుద్ధ ప్రతిపాదికన ప్రతిపాదనలు సిద్ధం చేసి తమ ముందు ఉంచాలని ఇంజినీర్లను ఆదేశించినట్లు ఆమె వెల్లడించారు. తమ దృష్టికి కార్పొరేటర్ శేఖర్ రెడ్డి తీసుకొచ్చిన సమస్యలను త్వరగా పరిష్కరిస్తామని చెప్పారు. కమిషనర్ అనుపమ అంజలి మాట్లాడుతూ తిరుపతి నగరంలో యూడీఎస్ మ్యాన్ హోల్ ఓవర్ ఫ్లోర్ సమస్యను గుర్తించి దశలవారీగా శాశ్వత పరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ ఇంజినీర్ మోహన్, ఎంఈ వెంకటరామిరెడ్డి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ హరికృష్ణ, డీఈ విజయ్ కుమార్ రెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కాటమరాజుకు ప్రత్యేక పూజలు



కాటమరాజుకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి

తిరుపతి రూరల్: సంక్రాంతి పర్వదినాల్లో నాలుగవ రోజు మంగళవారం ముక్కనుమ సందర్భంగా తుమ్మలగుంటలో కాటమరాజుకు ప్రత్యేక పూజలు చేసి పొంగళ్లు పెట్టారు. ముళ్లకంపలను కుప్పగా వేసి నిప్పు పెట్టారు. అనాదిగా వస్తున్న ఈ ఆచారాన్ని ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి దంపతులు గ్రామ పెద్దలతో కలసి ఘనంగా నిర్వహించారు. తుమ్మలగుంట చెరువు కట్ట వద్ద ఉసిరి చెట్టుకు పూజ చేశారు. స్థానిక మహిళలు పొంగళ్లు పెట్టి నైవేద్యంగా సమర్పించిన బెల్లం ప్రసాదాన్ని స్వీకరించారు. గ్రామ ప్రజల శ్రేయస్సు కోసం గ్రామ దేవతలకు పూజలు చేయడం చాలా ఆనందంగా ఉందని ఎమ్మెల్యే చెవిరెడ్డి స్పష్టం చేశారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి వలసలు



భాకరాపేటలో టీడీపీ నేతలను వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానిస్తున్న చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

భాకరాపేట : జగనన్న ముఖ్యమంత్రి అయిన తరువాత ప్రభుత్వమే ప్రజల వద్దకు వచ్చిందని తిరుపతి రూరల్ ఎంపీపీ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి అన్నారు. భాకరాపేటలో మంగళవారం పలువురు టీడీపీ నాయకులు వైఎస్సార్‌కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల అంచనాలకు మించి చంద్రగిరి నియోజకవర్గంలో సీఎం జగనన్న సహకారంతో తన తండ్రి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి అభివృద్ధి, సంక్షేమం చేపట్టారన్నారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ నేతలు కర్రి సుబ్రమణ్యం, వారి అనుచరులు మాట్లాడుతూ సీఎం జగనన్న, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి చేపడుతున్న పథకాలు, వారి మంచి పనులు నచ్చి చేరినట్లు చెప్పారు. పేదలకు అండగా నిలిచింది జగనన్న ప్రభుత్వమే అన్నారు. టీడీపీ నుంచి వచ్చిన శివరత్నమ్మ, పావని, నిర్మలమ్మ, చిన్నపాప, హర్షవర్ధన్, రూపేష్, హేమంత్, చలపతి, చరణ్, వినోద్, లోకేష్, రాము, భానుప్రకాష్‌తో పాటు మరి కొంతమందికి వైఎస్సార్‌సీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఎంపీపీ బాలం యుగంధర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ సునీత, సర్పంచ్ భూపాల్, డివిజన్‌పార్టీ అధ్యక్షుడు గురుశంకర్, నాయకులు మహేంద్రరెడ్డి, మధు, బాబీ, తదితరులు పాల్గొన్నారు.

చిట్లాకుప్ప తగాదా..

ఎర్రావారిపాళెం: మండలంలోని ఉదయమానిక్యం గ్రామం సుక్రోల ఇండ్ల వద్ద చిట్లాకుప్ప వద్ద గ్రామస్తుల మధ్య చిన్నపాటి తగాదా చోటుచేసుకుంది. అంతకు ముందే వారికి భూతగాదాలు సైతం ఉండేవని స్థానికులు చెబుతున్నారు. దీనిపై మంగళవారం గ్రామంలో తోపులాట జరిగింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకు ని అదుపుచేశారు. దీన్ని అక్కడే ఉన్న పచ్చబ్యాచ్ కొంతమంది సెల్‌ఫోన్‌లో రికార్డు చేసి పార్టీలు, వర్గాలంటూ తెరపైకి తీసుకువచ్చారు. వెనువెంటనే సోషల్ మీడియా కేంద్రంగా వైఎస్సార్ సీపీ జెండాలు ఇంటిపై కట్టనందుకు దాడి అంటూ తప్పుడు కథనాన్ని సృష్టించి పోస్టులు పెట్టారు. అప్పటికే సంఘటనపై విచారణ చేపట్టిన పోలీసులు ఈ తరహా తప్పుడు ప్రచారాన్ని చూసి కంగుతిన్నారు. భాకరా పేట సీఐ తులసీరామ్ గ్రామస్తుల మధ్య జరిగిన తగాదాను పార్టీలపై మోపి అల్లర్లు, అశాంతి నెలకొల్పవద్దు అంటూ ఘాటుగా స్పందించారు. చిట్లాకుప్ప వద్ద జరిగిన సంఘటనపై తప్పుడు ప్రచారం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. దీంతో తోకముడుచుకున్న పచ్చనేతలు జనసేన, టీడీపీ సానుభూతి పరులంటూ ప్లేట్ మార్చారు. ఇదంతా జరుగుతుండగానే నిజం గడప దాటే లోపే అబద్ధం ప్రపంచాన్ని చుట్టి వచ్చిందన్న చందంగా సోషల్ మీడియాలో ఆ పోస్టులు హల్‌చల్ అయ్యాయి. ఇరువర్గాలను పోలీసులు విచారిస్తున్నారు.

మెరుగైన సౌకర్యాలు కల్పించండి



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి

తిరుపతి అర్బన్: హైరిస్క్ గర్భిణులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన కలెక్టరేట్ నుంచి డివిజన్, మండలస్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో పలు సూచనలు చేశారు. ప్రధానంగా హైరిస్క్ గర్భిణుల ప్రసవ బాధ్యతతో పాటు రవాణా ఏర్పాటును పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్లు చూడాలని వెల్లడించారు. 108 వాహనం అందుబాటులో లేకపోతే ప్రైవేటు వాహనంలో వారిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించాలని చెప్పారు. అందుకోసం ప్రభుత్వం పీహెచ్‌సీలకు రూ.10 వేలు చొప్పున కేటాయించిందన్నారు. అనీమియా వ్యాధిగ్రస్తులకు అందించే పోషణ, ఫుడ్ విషయంలో జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉందన్నారు. రక్తహీనత తప్పనిసరి పరీక్షలు చేసి గుర్తించి వారికి బాలామృతం కచ్చితంగా అందించాలని చెప్పారు. సచివాలయ పరిధిలో 0–5 పిల్లలు, గర్భిణుల జాబితా అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. తహసీల్దార్లు, ఎంపీడీఓలు అంగన్‌వాడీ స్కూళ్లను పర్యవేక్షించాలని చెప్పారు. జలజీవన్ మిషన్ పనులను ఇంజినీరింగ్ అధికారులు పెండింగ్ లేకుండా చూడాల్సి ఉందన్నారు. సచివాలయాలకు అనుబంధంగా కమ్యూనిటీ కాంప్లెక్స్ స్థలాల కేటాయింపు, నిర్మాణాలపై దృష్టి పెట్టాలన్నారు. టిడ్కోతో పాటు జగనన్న లేఅవుట్లలో ఇంటి నిర్మాణాలు చేస్తున్న వారికి రుణాలు మంజూరు చేయించడంతో డీఆర్‌డీఏ, డ్వామా అధికారులు శ్రద్ధ చూపాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో డీఆర్వో శ్రీనివాసరావు, ఆర్డీఓ కిరణ్‌కుమార్, పలువురు జిల్లా అధికారులు, డివిజన్, మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.

8 మందికి జరిమానా

తిరుపతి లీగల్ : తిరుపతిలో మద్యం తాగి వాహనాలు నడపడం, ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించడం వంటి నేరాలకు పాల్పడిన 8 మందికి రూ.9 వేలు జరిమానా విధిస్తూ తిరుపతి మొదటి ప్రత్యేక కోర్టు మెజిస్ట్రేట్ సుబ్బలక్ష్మి మంగళవారం తీర్పు చెప్పారు. తిరుపతి ట్రాఫిక్ పోలీసులు 8 మందిపై కేసులు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచారు.

సాంస్కృతిక సంబరం.. కొండచుట్టు ఉత్సవం



ప్రత్యేక అలంకరణలో ధర్మరాజులస్వామి

చంద్రగిరి గ్రామ దేవత శ్రీమూలస్థాన ఎల్లమ్మ కొండు ఉత్సవం మంగళవారం అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. కొండచుట్టు మహోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కళాకారుల నృత్యాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. కేరళ వాయిద్యాలు, డప్పులు, దేవతామూర్తుల వేషధారణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

– చంద్రగిరి





కొండచుట్టు ఉత్సవంలో భాగంగా కళాకారుల నృత్యప్రదర్శనలు

అవినీతి, అక్రమాలకు కేరాఫ్ చంద్రబాబు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ దళిత విభాగం రాష్ట్ర కార్యదర్శి మల్లారపు మధు

తిరుపతి కల్చరల్: అవినీతి, అక్రమాలకు కేరాఫ్‌గా నిలిచిన మాజీ సీఎం చంద్రబాబు నాయుడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి ప్రజల నుంచి వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక బురదజల్లడం విడ్డూరమని వైఎస్సార్‌సీపీ దళిత విభాగం రాష్ట్ర కార్యదర్శి మల్లారపు మధు అన్నారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బలహీనవర్గాలంటే గిట్టని చంద్రబాబుకు వత్తాసు పలుకుతూ ఆయన మెప్పు కోసం కనీస రాజకీయ పరిజ్ఞానం లేని అజ్ఞాని ఎన్బీ సుధాకర్ రెడ్డి రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని విమర్శించడం సిగ్గుమాలిన చర్య అన్నారు. తన 45 ఏళ్ల రాజకీయ జీవితంలో మచ్చలేని నేతగా ప్రజాదరణ పొందుతూ బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి నిరంతరం కృషి చేస్తున్న గొప్పవ్యక్తి మంత్రి పెద్దిరెడ్డి అన్నారు. అలాంటి నేతపై కనీసం వార్డు సభ్యుడిగా కూడా గెలవలేని సుధాకర్‌రెడ్డి ఇకనైనా విమర్శలు చేయడం ఆపుకోకపోతే తగిన బుద్ధి చెబుతామన్నారు. ఆ పార్టీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి బాల మాట్లాడుతూ దళితులంటే గిట్టని చంద్రబాబు, వారిని హేళన చేసి అవమానించడమే గాక అక్రమ కేసులు బనాయించి ఇబ్బంది పెట్టిన విషయాన్ని యావత్ దళితవర్గం మరిచిపోలేదన్నారు. మల్లంగుంట సర్పంచ్ రామచంద్రయ్య, పార్టీ యువజన విభాగం నేత హరిచౌహాన్ నాయక్ పాల్గొన్నారు.

రాష్ట్రంలో ప్రతి రోజూ పండగే

- సాంస్కృతిక శాఖ మంత్రి ఆర్కేరోజా
- రోజా ట్రస్టు సేవలు అభినందనీయం : అలీ
- సంప్రదాయాలకు అద్దం పట్టేలా పోటీలు
- స్విమ్స్ డైరెక్టర్ వెంగమాంబ



ఎద్దుల బండిపై వస్తున్న మంత్రి ఆర్కేరోజా, అలీ

నగరి : ముఖ్యమంత్రి జగనన్న పాలనలో రాష్ట్ర ప్రజలకు ప్రతిరోజు పండుగే అని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసుల, క్రీడాశాఖ మంత్రి ఆర్కేరోజా అన్నారు. మంగళవారం నగరి డిగ్రీకళాశాల మైదానంలో నియోజకవర్గ స్థాయిలో రోజా ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ముగ్గులు పోటీలు జరిగాయి. పోటీలకు రాష్ట్ర ఎలక్ట్రానిక్ మీడియా సలహాదారు అలీతో కలిసి ఎద్దుల బండిపై ఆమె విచ్చేయడం ప్రత్యేకతను సంతరించుకుంది. పోటీల నిర్వహణలో భాగంగా మైదానంలో చిలకజోస్యం స్టాలు వద్ద ఆలీ, స్విమ్స్ డైరెక్టర్ వెంగమాంబ జోస్యం చెప్పించుకున్నారు. ఎంపీపీ భార్గవి, సీడీపీవో కృష్ణవేణికి మంత్రి రోజా మెహందీ పెట్టారు. పొంగలి పెట్టి, డూడూ బసవన్నకు పూజలు చేశారు. సంక్రాంతి పిండి వంటలను తెలిపే ఐసీడీఎస్ బజార్‌లో మంత్రి, అతిథులు పదార్థాల రుచిచూశారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ జగనన్న ప్రతి ఇంటికీ ఏం చేస్తే సంతోషం ఉంటుందో వారి ఇళ్లవద్దకే వలంటీర్‌ను పంపి తెలుసుకుని, ప్రతి పథకాన్ని వారి ఖాతాలకే జమ చేసి ఆదుకుంటున్నారన్నారు. నేడు ఆనందంగా సంక్రాంతిని వారు జరుపుకుంటున్నారన్నారు. నగరి కొండచుట్టుకు చాలా విశిష్టత ఉందని, అందుకే పోటీలు నిర్వహించామన్నారు. సాంస్కృతిక మంత్రిగా సంప్రదాయాలు కాపాడాలన్న తపన, అక్కచెల్లెళ్లను సంతోషపెట్టాలన్న కోరికతోనే పోటీలను నిర్వహించినట్లు తెలిపారు. పోటీలో పాల్గొన్న వారందరికీ ఆడపడుచుగా చీర, గాజులు సాంగెం పెట్టినట్లు పేర్కొన్నారు.

రోజా ట్రస్టు సేవలు అభినందనీయం

రాష్ట్ర ఎలక్ట్రానిక్ మీడియా సలహాదారు అలీ మాట్లాడుతూ ముగ్గులు చూస్తుంటే కష్టపడి వేసినట్లు లేదని.. ఇష్టపడి వేసినట్లు ఉందన్నారు. బహుమతి రానివారు నిరుత్సాహపడాల్సిన అవసరం లేదన్నారు. డ్రామా వేస్తే తనకు తొలుత బహుమతిగా లైఫ్‌బాయ్ సోపు వచ్చిందని తెలిపారు. అదే నేడు ఈ స్థాయికి చేర్చిందన్నారు. తోటి కళాకారులకు మంచి చేయడంలో మంత్రి రోజా ముందుంటారని తెలిపారు. ఈ రోజు ఆమె చేసిన పండగ ఏడాదంతా గుర్తుపెట్టుకునేలా ఉందన్నారు. సొంత ట్రస్టు నుంచి ఇంతటి ప్రోత్సాహం అందించడం అభినందనీయమన్నారు.

సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం



ముగ్గులు పరిశీలిస్తున్న మంత్రి, అతిథులు

స్విమ్స్ డైరెక్టర్ వెంగమాంబ మాట్లాడుతూ సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టేలా ఈ పోటీలు ఉన్నాయని తెలిపారు. సంక్రాంతి పండుగంటే అందరికీ గుర్తొచ్చేది ముగ్గులు. అలాంటి కార్యక్రమంలో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. తుడా కార్యదర్శి లక్ష్మి మాట్లాడుతూ కళలు, సంస్కృతి, సంప్రదాయాలను ఎప్పటికప్పుడు పరిరక్షించుకుంటూ భావితరాలకు అందించడం మన బాధ్యతన్నారు. ఆ ప్రయత్నమే ఇక్కడ జరిగినట్లుందన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి సోదరుడు, వైఎస్సార్ సీపీనేత రాంప్రసాద్ రెడ్డి, నగరి, పుత్తూరు మున్సిపల్ చైర్మన్లు పీజీ నీలమేఘం, హరి, మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి, రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ చంద్రారెడ్డి, మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ బాలకృష్ణ, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మాహిన్, ఎంపీపీలు భార్గవి, దీప, మున్సిపల్ వైస్‌చైర్మన్లు బాలన్, వెంకటరత్నం, జయప్రకాష్, సీడీపీవో కృష్ణవేణి, వైస్ ఎంపీపీలు, పీఏసీఎస్ చైర్మన్లు, ఆర్బీకే చైర్మన్లు, ఆలయకమిటీ చైర్మన్లు, కౌన్సిలర్లు, ఎంపీటీసీ సభ్యులు, కోఆప్షన్ సభ్యులు, మెప్మా సిబ్బంది, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.